


ఎన్నికల బరిలో నిలిచేది ఎవరు.. ఎవరికి టిక్కెట్ ఇస్తారు.. వైసీపీ ఫేక్ ప్రచారం.. పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ.. తదితరాలన్నింటికీ తెరపడింది. ఎన్నికల బరిలో ఉండేదెవరో స్పష్టత వచ్చేసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలకు శనివారం టీడీపీ, జనసేన అధినేతలు సంయుక్తంగా ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించారు. సిట్టింగ్‌లకు.. సీనియర్లకు.. సమర్థతకు.. విధేయతకు తొలిజాబితాలో పెద్ద పీట వేశారు. ప్రతి ఎన్నికల్లోనూ చివరి నిమిషాన పేరు ప్రకటించే సంప్రదాయానికి భిన్నంగా చంద్రబాబు ఈ సారి 52 రోజుల ముందే అభ్యర్థి ఎవరో తేల్చేయడం గమనార్హం. పొత్తు నేపథ్యంలో జనసేన ప్రకటించిన జాబితాలో తెనాలి ఉండగా ఇక్కడి నుంచి ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాదెండ్ల మనోహర్‌కు అవకాశం దక్కింది. రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్ల ప్రకటనతో ఇరు పార్టీల శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. అభ్యర్థులకు అభినందనలు తెలుపుతూ, ప్రదర్శనలు నిర్వహిస్తూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల్లో సత్తా చూపి విజయభావుటా ఎగరవేసి అధినేతలకు గిఫ్ట్ అందజేస్తామని అభ్యర్థులు ప్రకటించారు.


ఉమ్మడిగా.. సై

- టీడీపీ, జనసేన తొలి జాబితా విడుదల
- పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు.. సంబరాలు
- తెనాలి నుంచి జనసేన అభ్యర్థిగా మనోహర్ పేరు ఖరారు
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 14 స్థానాల్లో అభ్యర్థుల ఖరారు
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సీనియర్లకు మరో అవకాశం
- బాపట్ల జిల్లాలో మూడు చోట్ల సిట్టింగ్‌లకే తిరిగి అవకాశం
- బాపట్ల నుంచి వేగేశన, ప్రత్తిపాడు నుంచి రామాంజనేయులు తొలి సారి పోటీ

(గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, తెనాలి, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం, జనసేన పార్టీల తరపున శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితా విడుదలతో ఉత్కంఠకు తెరపడింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆరుగురి మినహా మిగిలిన అన్ని స్థానాలకు అభ్యర్థులను ఒకేసారి ప్రకటించారు. దీంతో ఇరు పార్టీల శ్రేణులు ఆనందోత్సాహాలలో మునిగి తేలారు. అభ్యర్థులు సైతం ఇకపై మరింతగా ప్రజలతో మమేకమయ్యేందుకు కార్యాచరణకు సిద్ధమయ్యారు. జిల్లాలో వైసీపీ ఖాతా తెరవకుండా ఉండడమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉండనున్నదని అభ్యర్థులు ప్రకటించారు. తొలి జాబితాలో పల్నాడు జిల్లా పరిధిలోని నాలుగు స్థానాలకు, బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల మినహా మిగిలిన ఐదు స్థానాలకు, గుంటూరు జిల్లా పరిధిలోని ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. వైసీపీలో అభ్యర్థుల ఎంపికపై గందరగోళం నెలకొనగా టీడీపీ ముందంజలో ఉంది. ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించి టీడీపీ, వైసీపీకి సవాల్ విసిరింది. తొలి జాబితాలో సీటు ఖరారైన వారిలో మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబులు ఉన్నారు. బాపట్ల జిల్లాలో రేపల్లె, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకే అవకాశం కల్పించారు. బాపట్ల నుంచి వేగేశన నరేంద్రవర్మ, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నుంచి విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులు తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పార్టీ అభ్యర్థుల ప్రకటనతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీలతో పాటు బాణసంచా కాల్చి ఆనందోత్సాహాలను వ్యక్తం చేశాయి. అభ్యర్థులను నేతలు, కార్యకర్తలు కలిసి సత్కరించారు. నేతలకు శుభాకాంక్షలు చెప్పడానికి శ్రేణులు పార్టీ కార్యాలయాల్లో బారులు తీరారు. ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని అటు టీడీపీ, ఇటు జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రకటించారు.

నాలుగోసారి జీవీ



టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులుకు వినుకొండ నుంచి పోటీకి నాలుగో సారి అధిష్ఠానం అవకాశం ఇచ్చింది. ఆయన వినుకొండ నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఓటమి చెందిన జీవీ వరుసగా నాలుగోసారి వినుకొండ బరిలో దిగుతున్నారు. టీడీపీ ఆవిర్భావం అనంతరం జరిగిన ఎన్నికల్లో ఇక్కడ మూడు సార్లు పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. టీడీపీ పొత్తులో సీపీఐ రెండు సార్లు విజయం సాధించింది. మొదటి నుంచి టీడీపీకి వినుకొండ బలమైన నియోజకవర్గం.

సత్తెనపల్లి నుంచి కన్నా



సత్తెనపల్లి నుంచి మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పేరును పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. గతంలో నాలుగుసార్లు పెదకూరపాడు నుంచి, గుంటూరు పశ్చిమ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందిన కన్నా టీడీపీ అభ్యర్థిగా తొలి సారి సత్తెనపల్లి బరిలో దిగుతున్నారు. 1989లో మొట్టమొదటి సారిగా పెదకూరపాడు అసెంబ్లీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1994, 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2009లో గుంటూరు పశ్చిమ నుంచి విజయం సాధించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయ భాస్కరరెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, కొణిజేటి రోశయ్య, ఎన్ కిరణ్ కుమార్‌రెడ్డిల మంత్రి వర్గాల్లో పలు మంత్రి పదవులు నిర్వహించారు. కాగా 2024 ఫిబ్రవరి 24న ఆయనను సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించారు.

పుల్లారావు ఆరోసారి



చిలకలూరిపేట నుంచి వరుసగా ఆరోసారి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పోటీ చేస్తున్నారు. గతంలో ఐదు సార్లు పోటీ చేయగా మూడు సార్లు విజయం సాధించారు. 1983 నుంచి జరిగిన ఎన్నికల్లో 1983, 1989, 1999, 2009, 2014, ఎన్నికల్లో టీడీపీ ఇక్కడ విజయం సాధించింది.

బ్రహ్మారెడ్డి మూడోసారి..



మాచర్ల టీడీపీ అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డి పేరును అధిష్ఠానం ప్రకటించింది. ఉన్నత విద్య చదివిన బ్రహ్మారెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ఇది మూడోసారి. వారి తల్లిదండ్రులు నాల్గుసార్లు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. గతంలో 2004, 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. 1999లో బ్రహ్మారెడ్డి తల్లి దుర్గాంబ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మాచర్లలో అరాచకాలను అడ్డుకుంటూ పార్టీ క్యాడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేశారు. 2021 డిసెంబరు 22న బ్రహ్మారెడ్డిని మాచర్ల ఇన్‌చార్జిగా చంద్రబాబు నియమించారు. దీంతో నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం, ధైర్యం నెలకొంది. ఏదైనా జరిగితే బ్రహ్మారెడ్డి వస్తాడనే భావం ఆ పార్టీ నేతల్లో ఉంది.

పల్నాడు జిల్లా..

సత్తెనపల్లి	కన్నా లక్ష్మీనారాయణ
చిలకలూరిపేట	ప్రత్తిపాటి పుల్లారావు
వినుకొండ	జీవీ ఆంజనేయులు
మాచర్ల	జూలకంటి బ్రహ్మారెడ్డి





ఆనందబాబు నాలుగో సారి..

వేమూరు అభ్యర్థిగా బరిలో ఉండనున్న మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు రాజకీయాల్లో అంచలంచలుగా ఎదిగారు. కొల్లిపర మండలం సిరిపురంలో జన్మించిన ఆయన గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. తదుపరి బీఏ పూర్తి చేసి, ఆంధ్ర యూనివర్సిటీలో బీఎల్ పట్టా పొందారు. రాజకీయాలపై ఆసక్తితో 1987-88లలో గుంటూరు జిల్లా తెలుగు విద్యార్థి అధ్యక్షుడిగా ఐదేళ్ల తర్వాత ఆర్గనైజింగ్ సెక్రటరిగా, పార్టీ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. 2009లో తొలిసారి వేమూరు నుంచి గెలుపొందారు. 2014లో రెండోసారి విజయం సాధించి మంత్రిగా కూడా పనిచేశారు. 2019లో ఓటమి పాలయ్యారు. మరలా ఇప్పుడు టీడీపీ అభ్యర్థిగా వేమూరు నుంచి బరిలో దిగనున్నారు.

గొట్టిపాటి ఐదో సారి



అద్దంకి నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు గెలుపొంది ఓటమెరుగని నేతగా గొట్టిపాటి రవికుమార్ కీర్తి గడించారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రవికుమార్‌కే మరో సారి టీడీపీ నుంచి పోటీ చేసే అవకాశం వచ్చింది. 2004లో మార్టూరు నుంచి కాంగ్రెస్ తరపున గెలుపొందగా, 2009లో అద్దంకి నుంచి అదే పార్టీలో బరిలో ఉండి విజయం సాధించారు. 2014లో వైసీపీ తరపున గెలిచి హ్యాట్రిక్ విజయం నమోదు చేశారు. 2019లో టీడీపీ తరపున గెలుపొందారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న రవికుమార్ రాబోయే ఎన్నికలలో మరోమారు బరిలో నిలిచారు.

హ్యాట్రిక్‌పై ఏలూరి కన్ను



పర్చూరు ఎమ్మెల్యేగా 2014, 2019లో టీడీపీ తరపున గెలుపొందిన ఏలూరి సాంబశివరావు 2024లో కూడా బరిలో ఉండనున్నారు. ఈ ఎన్నికల్లో కూడా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమయ్యారు. 2019లో ఎన్టీఆర్ అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావుపై గెలుపు బావుటా ఎగురవేశారు. మార్టూరు మండలం కోనంకిలో జన్మించిన ఆయన హార్టికల్చర్ విభాగంలో మాస్టర్ డిగ్రీ పొందారు. అనంతరం అదే విభాగంలో ప్రభుత్వ ఉద్యోగిగా కూడా సేవలందించారు. ప్రస్తుతం పర్చూరు ఎమ్మెల్యేగా ఉండడంతో పాటు బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు.

హ్యాట్రిక్ లక్ష్యంలో అనగాని



రేపల్లె టీడీపీ అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్ నాలుగోసారి బరిలో ఉండనున్నారు. ఆయన బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశారు. 2009లో టీడీపీ తరపున పోటీ చేసిన ఆయన మోపిదేవి చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత వరుసగా 2014, 2019లలో టీడీపీ తరపున విజయం సాధించిన ఆయన ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలనే లక్ష్యంతో ఉన్నారు. రాజకీయంగా కుటుంబ నేపథ్యం ఉండడంతో పాటు నియోజకవర్గంలో సేవలందించడంలో తనదైన మార్కు చూపించారు. అంతేకాకుండా టీడీపీ అధినేతతో సన్నిహిత అనుబంధం ఉన్న అతి కొద్దిమందిలో అనగాని ఒక్కడిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

ఎన్నికల బరిలో వేగేశన



బాపట్ల టీడీపీ అభ్యర్థిగా ఖరారైన వేగేశన నరేంద్ర వర్మ.. వ్యాపార రంగంలో విజయం సాధించి వేగేశన ఫౌండేషన్ పేరిట సేవలందిస్తూ రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు. 2009 నుంచి టీడీపీలో క్రియాశీలకంగా ఉంటున్నప్పటికీ తొలిసారి ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పార్టీకి విధేయుడన్న గుర్తింపే ఆయనకు బాపట్లలో పోటీచేసే అవకాశం వచ్చింది.

బాపట్ల జిల్లా

పర్చూరు	ఏలూరి సాంబశివరావు
బాపట్ల	వేగేశన నరేంద్రవర్మ
వేమూరు	నక్కా ఆనందబాబు
రేపల్లె	అనగాని సత్యప్రసాద్
అద్దంకి	గొట్టిపాటి రవికుమార్

రెండో సారి లోకేశ్..



మంగళగిరి నుంచి యువ నేత నారా లోకేశ్ రెండో పర్యాయం బరిలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో ఆయన ఇక్కడి నుంచి పోటీ చేసి ఓటమి చెందినా నియోజకవర్గాన్ని వీడకుండా పార్టీ శ్రేణులకు అండగా ఉన్నారు. ఈ ఐదేళ్లలో ప్రతిఒక్కరికీ ఏదో ఒక రూపంలో ఆయన సాయమందిస్తూ వచ్చారు. లాంఛనంగా ఆయన పేరు తాజాగా ప్రకటించినప్పటికీ ఎప్పటి నుంచో ఆయన తన విజయానికి బాటలు వేసుకుంటూ వస్తున్నారు. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి గ్రూపు విబేధాలు మూలంగా గెలుపు అవకాశాల్లేవని, ఆయన్ని తప్పించి గంజి చిరంజీవిని బరిలోకి దించిన విషయం తెలిసిందే. దీంతో ఆళ్ల వైసీపీకి రాజీనామా చేశారు. అయితే ఇక్కడ ఎవరికి టిక్కెట్ ఇచ్చినా ఆళ్ల వ్యతిరేకంగా చేస్తే గెలుపు అసాధ్యమని భావించిన వైసీపీ అధిష్ఠానం తిరిగి ఆయన్ను బుజ్జగించి పార్టీలోకి చేర్చుకున్నది.

నాలుగో సారి శ్రావణ్‌కుమార్



ఎస్సీ నియోజకవర్గమైన తాడికొండ నుంచి మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ నాలుగో సారి రంగంలోకి దిగుతున్నారు. ప్రస్తుతం ఆయన కొత్తగా ఏర్పడిన గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. 2009లో మొదటిసారి ఎన్నికల బరిలోకి దిగిన శ్రావణ్‌కుమార్ డొక్కా మాణిక్యవరప్రసాద్ చేతిలో ఓటమి చెందారు. తిరిగి 2014లో అదే నియోజకవర్గం నుంచి బరిలోకి దిగి విజయం సాధించారు. తుళ్ళూరు ప్రాంతాన్ని రాజధానిగా ప్రకటించటంతో ఆయన రాజధాని ప్రాంత ఎమ్మెల్యేగా కీలక పాత్ర పోషించారు. తిరిగి 2019లో బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. అయినా ఆయన నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు అండగా నిలవడమే కాకుండా అమరావతి రైతుల ఉద్యమానికి అండగా నిలిచారు.

ఏడో సారి నరేంద్ర



పొన్నూరు నుంచి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేరును ప్రకటించారు. అదే నియోజకవర్గం నుంచి ఆయన ఏడో పర్యాయం ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ గాలిలో స్వల్ప మెజార్టీతో ఆయన ఓటమి పాలై డబుల్ హ్యాట్రిక్‌ను మిస్ అయ్యారు. ఈ ఐదేళ్ల ఆయన ప్రభుత్వంపై పార్టీ పరంగా పోరాటం చేయటమే కాకుండా వ్యక్తిగతంగా కూడా తాడేపల్లి ప్యాలెస్‌ను ఢీ కొనాల్సి వచ్చింది. దీంతో వ్యక్తిగతంగా కక్ష కట్టి సంగం డెయిరీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆయన్ను అకారణంగా జైలు పాలు కూడా చేశారు. న్యాయ పోరాటం ద్వారా వైసీపీ ప్రభుత్వాన్ని ఢీ కొనటమే కాకుండా డెయిరీ వారి బారిన పడకుండా నరేంద్ర కాపాడుకున్నారు.

ఐదో సారి నాదెండ్ల



మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు తనయుడైన నాదెండ్ల మనోహర్ జనసేన కోటాలో తెనాలి సీటును దక్కించుకున్నారు. గతంలో మూడు పర్యాయాలు కాంగ్రెస్ తరపున ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మనోహర్ 2004, 2009లో వరుస విజయాలు చవిచూశారు. స్పీకర్‌గా కూడా పనిచేసే అవకాశం దక్కింది. ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున 2014 లో బరిలోకి దిగి పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత జనసేనలో చేరి 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. ప్రస్తుతం ఆ పార్టీ రాజకీయాల వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా కీలకపాత్ర వహిస్తున్నారు. అయితే 2019 ఎన్నికల్లో ఓడిపోయినా నియోజకవర్గాన్నే అంటిపెట్టుకుని ప్రభుత్వంపై అలుపెరగని పోరాటం చేస్తూ జనసేనతో పొత్తును స్వాగతించిన ఆలపాటికి ఈసారి నిరాశ ఎదురైంది.

ప్రత్తిపాడు నుంచి విశ్రాంత ఐఏఎస్



ఎస్సీ నియోజకవర్గమైన ప్రత్తి పాడు నుంచి విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులు పేరును ప్రకటించారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నారు. గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసి పరాజయం చెందిన స్థానికుడైన కందుకూరి వీరయ్యకు ఈ పర్యాయం సీటు ఇవ్వాలని జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నేతలు ప్రయత్నించినా చంద్రబాబు రామాంజనేయులు వైపే మొగ్గారు. కొన్నేళ్ళుగా రాష్ట్ర కార్యాలయంలో ఉండి ఐటీ వింగ్ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న రామాంజనేయులుకు అది ప్లస్ పాయింట్‌గా మారింది. కొందరు ఐఏఎస్‌లకు అవకాశం కల్పించాలన్న చంద్రబాబు నిర్ణయంతో రామాంజనేయులు పేరు ఖరారైంది. ఈయన గతంలో గుంటూరు కలెక్టర్‌గా పనిచేశారు.

గుంటూరు జిల్లా



మంగళగిరి	నారా లోకేశ్
తాడికొండ	తెనాలి శ్రావణ్‌కుమార్
ప్రత్తిపాడు	బూర్ల రామాంజనేయులు
పొన్నూరు	ధూళిపాళ్ల నరేంద్ర
తెనాలి	నాదెండ్ల మనోహర్

జంగా సీటుతో యరపతినేనికి లింకు



గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేరు మొదటి జాబితాలోనే తప్పనిసరిగా ఉంటుందని ఆయన అభిమానులు భావించారు. వైసీపీ ప్రభుత్వంపై పోరాటం చేస్తూ పార్టీ శ్రేణులకు అండగా నిలిచిన యరపతినేనికి సీటు ఖాయమే అయినప్పటికీ కొన్ని కారణాల దృష్ట్యా అధికారికంగా ప్రకటించలేదు. నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా అనీల్ కుమార్ వలస రావడంతో సామాజిక సమీకరణల సమస్య టీడీపీకి ఎదురైంది. నరసరావుపేట పార్లమెంటు పరిధిలో ఏదో ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీసీ అభ్యర్థిని బరిలోకి దించాలని చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న ఎమ్మెల్సీ జంగాకి తమ పార్టీ తరపున బరిలోకి దించాలని టీడీపీ ఆలోచన. గతంలో రెండు సార్లు విజయం సాధించిన గురజాలనే ఆయన కోరుకోగా ఇచ్చే అవకాశం లేనందున జంగాకు ప్రత్యామ్నాయం చూసిన తర్వాతే యరపతినేని పేరు ప్రకటించాలని అధిష్ఠానం యోచన చేస్తున్నట్లు సమాచారం.

పెదకూరపాడుపై కసరత్తు

పల్నాడు, గుంటూరు లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ పెండింగ్ స్థానాలపై టీడీపీ కసరత్తు చేస్తోంది. పెదకూరపాడు ఇన్‌చార్జిగా డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ఉన్నారు. గత ఎన్నికల్లో పరాజయం పాలైనా నియోజకవర్గాన్ని వీడకుండా పార్టీ శ్రేణులకు ఆయన అన్ని విధాలుగా అండగా ఉన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ వీడిన ముఖ్య నేతలు తిరిగి శ్రీధర్ పక్షాన చేరి ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నారు. బయట వారిని తీసుకురావటానికి వీల్లేదని నేతలు, శ్రేణులు ఇటీవల గుంటూరులో సమావేశమై డిమాండ్ చేశారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడు చేసుకుని పరీక్షలకు హాజరుకావచ్చు
- జిల్లాలో 92 పరీక్షా కేంద్రాలు.. కేంద్రాల వద్ద 144 సెక్షన్
- 8.30 గంటలకే కేంద్రాల్లోకి అనుమతి.. 9 గంటల తరువాత నోఎంట్రీ

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 24: ఇంటర్ పరీక్షలకు జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేశామని, నెట్ నుంచి డౌన్‌లోడు చేసుకున్న హాల్‌టిక్కెట్లతో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించామని ఇంటర్ బోర్డు ఆర్ఐవో జీకే జుబేర్ వెల్లడించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై ఆర్ఐవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జుబేర్ మాట్లాడారు. మార్చి 1 నుంచి ప్రారంభం అయ్యే పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 27,605 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 31,830 మంది చొప్పున మొత్తం 59,435 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 92 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇందులో 19 కొత్త కేంద్రాలకు ఈ ఏడాది అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు, కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని ఇప్పటికే పోలీసుశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. పరీక్షల కోసం మొత్తం 1,750 మందికి ఇన్విజిలేషన్ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారని విద్యార్థులను ఉదయం 8.30 నుంచే కేంద్రాల్లోకి అనుతిస్తామని, 9 గంటలు దాటిన తరువాత కేంద్రాల్లోకి అనుతించమని స్పష్టం చేశారు. కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్ వద్ద తప్ప ఏ ఒక్కరి వద్ద సెల్‌ఫోన్స్ ఉండకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో డీఈసీ సభ్యులు బాలమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీకే జుబేర్

ఆదర్శ మంగళగిరి కోసం అంతా కలిసిరండి

మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ పిలుపు ● పలువురు తటస్థ ప్రముఖులతో యువనేత భేటీ ● కాజ గ్రామంలో పార్టీ కార్యాలయం ప్రారంభం







తాడేపల్లిలో పాస్టర్ న్యూమన్ కుటుంబ సభ్యులతో. తాడేపల్లిలో పఠాన్ అబ్బాస్ ఖాన్ కుటుంబ సభ్యులతో, మంగళగిరి పర్యటనలో భాగంగా దివ్యాంగులతో నారా లోకేశ్

మంగళగిరి, ఫిబ్రవరి 24: మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలని మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు తటస్థ ప్రముఖులను శనివారం రాత్రి ఆయన కలుసుకున్నారు. తొలుత తాడేపల్లి 8వ వార్డుకు చెందిన పాస్టర్ కోలా న్యూమన్ నివాసానికి వెళ్లగా కుటుంబ సభ్యులు లోకేశ్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. రాష్ట్ర వ్యాపితంగా క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూమన్ విజ్ఞప్తి చేశారు. లోకేశ్ మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సమయంలో క్రిస్టియన్ మైనార్టీల సమస్యలను తాను స్వయంగా అధ్యయనం చేశానని చెప్పారు. పాస్టర్లకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతోపాటు క్రిస్టియన్ మైనార్టీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం తాడేపల్లికి చెందిన పఠాన్ అబ్బాస్‌ఖాన్ ఇంటికి వెళ్లారు. గత ప్రభుత్వంలో దుల్హన్, రంజాన్ తోఫా వంటి పథకాలను అమలు చేస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని రద్దు చేసిందని గుర్తుచేశారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మైనార్టీ సోదరులను కడుపులో పెట్టుకుని చూసుకుంటుందని, గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరిస్తామని చెప్పారు. అనంతరం మంగళగిరిలో ప్రణవి ఆర్థో కేర్ సెంటరు అధినేత తోట శ్రీనివాస రాఘవను వారి నివాసంలో కలుసుకున్నారు. మంగళగిరి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నందుకు లోకేశ్ అభినందనలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఆరోగ్య సేవల కోసం ఎన్టీఆర్ ఆరోగ్య రథాలను ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో వైద్య సేవలను విస్తృతం చేసేందుకు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. చివరిగా మంగళగిరికి చెందిన కొటికలపూడి శ్రీనివాసరావును కలుసుకున్నారు. శ్రీనివాసరావు సెంట్రల్ వాటర్ కమిషన్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించడమే కాక వివిధ రాష్ట్రాల్లో విధులు నిర్వర్తించారు. మంగళగిరి సర్వతోముఖాభివృద్ధికి పెద్దల సలహాలు, సూచనలు అవసరమని, రాబోయే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం కాజలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాజ గ్రామానికి చెందిన వైసీపీ నేత పల్లా వెంకటేశ్వరరావు, ఆయనతోపాటు 65 వైసీపీ కుటుంబాలలో లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరాయి. వీరికి లోకేశ్ పసుపు కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

అరాచక పాలన నుంచి రాష్ట్రానికి త్వరలో విముక్తి

- 1530వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 24: వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రానికి త్వరలో విముక్తి కలుగుతుందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1530వ రోజుకు చేరుకున్నాయి. ఈ సంద్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ, ప్రజా రాజధాని అమరావతి గెలుస్తుందన్నారు. మూడు ముక్కలాటకి శాశ్వతంగా స్వస్తి చెబుదామని ఐదుకోట్ల మంది తెలుగు ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు. బాధల నుంచి విముక్తి కలగాలంటే విజన్ ఉన్న చంద్రబాబు నాయుడి లాంటి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఎప్పటికైనా అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని స్పష్టం చేశారు. ఉన్నత న్యాయస్థానం తీర్పు కూడా ఇదే అంశాన్ని ధ్రువీకరించదన్నారు. న్యాయం ధర్మం భూములిచ్చిన తమ వైపు ఉందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో రైతు ఆందోళనలు కొనసాగాయి.



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

నేడు మంగళగిరి ఎయిమ్స్ జాతికి అంకితం

- వర్చువల్‌గా చేయనున్న ప్రధాని నరేంద్ర మోదీ

మంగళగిరి, ఫిబ్రవరి 24: దేశంలో కెల్లా అత్యుత్తమంగా రూపుదిద్దుకున్న మంగళగిరి ఎయిమ్స్ ఆదివారం జాతికి అంకితం కానున్నది. అత్యంత సువిశాలమైన ప్రాంతంలో పచ్చని కొండల నడుమ, ఆహ్లాదకరమైన గ్రీనరీ మధ్య సుందరంగా, విజయవాడ-గుంటూరు నగరాల నడమ, నవ్యరాజధాని అమరావతికి అత్యంత చేరువగా మంగళగిరి ఎయిమ్స్ అత్యద్భుతంగా ఆవిష్కృతమైంది. ఇన్నీ అనుకూలతలతో కూడిన ఎయిమ్స్ దేశంలో మరెక్కడా లేవన్నది కేంద్ర వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల మాట. కేంద్ర ప్రభుత్వం మంగళగిరిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేయనున్నారు. దీంతో పాటు 9 క్రిటికల్ కేర్ బ్లాకులకు శంకుస్థాపన చేయనున్నారు. ఎయిమ్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ మధుబానందకర్ మాట్లాడుతూ ఆదివారం జరగనున్న కార్యక్రమంలో గవర్నరు ఎస్. అబ్దుల్‌నజీర్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సూఖ్ మాండవ్య, కేంద్ర బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద జోషి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, గిరిజన వ్యవహారాల శాఖామంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ ఎవార్, కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్, ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని హాజరుకానున్నారని తెలిపారు.

51 మంది ఎస్ఐలకు నియామక పత్రాలు

గుంటూరు, ఫిబ్రవరి 24: గుంటూరు రేంజ్ పరిధిలో గత సంవత్సరంలో జరిగిన పోలీసు నియామక పక్రియలో ఎంపికైన 51 మంది ఎస్ఐ అభ్యర్థులకు శనివారం రేంజ్ ఐజీ పాలరాజు నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం వారందరినీ శిక్షణ నిమిత్తం అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీకి ఎంపిక చేశారు. దీంతో వారు శనివారం సాయంత్రం గుంటూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి ప్రత్యేక బస్సుల్లో అనంతపురానికి బయలు దేరి వెళ్లారు.



అక్రమ ఇసుక దందాపై చర్యలు తీసుకోవాలి

- టీడీపీ, జనసేన శ్రేణులు

కొల్లూరు, ఫిబ్రవరి 24: వైసీపీ నాయకులు చేస్తున్న ఇసుక దందా, అక్రమ తవ్వకాల మీద చర్యలు తీసుకోవాలని కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కొల్లూరు మండలం పెదలంకలో ఉన్న కృష్ణానదిలో జరిగే అక్రమ ఇసుక తవ్వకాలను మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు మాజీమంత్రి నక్కా ఆనందబాబు ఆదేశాల మేరకు టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఆయా పార్టీల నాయకులు ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ, మంత్రి నాగార్జున అవినీతి మత్తులో సంపాదనే ధ్యేయంగా ఇసుక అక్రమ తవ్వకాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మంత్రితో పాటు వైసీపీ నాయకులు భాగస్వామ్యం ఉండటం వల్ల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వేమూరు నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలించి ఇసుక మాఫియాపై వెంటనే తగుచర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన పార్టీల తరఫున డిమాండ్ చేశారు. ఈ విషయంపై తహసీల్దార్, ఎస్ఐలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త ఊసా రాజేష్, బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు, బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు తమ్మా శివారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, బాపట్ల పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మొవ్వా శరత్‌చంద్ర, మండల జనసేన అధ్యక్షులు చలమయ్య నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

మంగళగిరిలో 180 కుటుంబాలు టీడీపీలో చేరిక

- కండువా కప్పి ఆహ్వానించిన నారా లోకేశ్

మంగళగిరి, ఫిబ్రవరి 24: మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతోంది. ఎన్నికల సమయానికి ఆ పార్టీలో ఎవరు వుంటారో.. ఎవరు వెళ్లిపోతారో తెలియని పరిస్థితి నెలకొంది. వైసీపీ మునిగిపోతున్న నావ అని గమనించిన పలువురు నేతలు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నారు. తాజాగా, నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 180 కుటుంబాలు శనివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో పసుపు కండువా కప్పుకున్నాయి. ఉండవల్లిలోని నివాసంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరి అభివృద్ధిని కాంక్షిస్తూ తమ వెంట వస్తున్న వారిని అభినందించారు. పార్టీలో కొత్తగా చేరిన వారిని ఇప్పటికే పనిచేస్తున్న నేతలు కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. తాడేపల్లి పట్టణానికి చెందిన పల్లెపోగు అరుణ్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, చింకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, 11వ వార్డుకు చెందిన 30 కుటుంబాలు, మంగళగిరి పట్టణానికి చెందిన అవ్వారు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, చిర్రావూరుకు చెందిన రెడ్డి విజయ్, మేడూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మరో 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్లరాజు, తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన కార్యకర్తలతో లోకేశ్

ల్యాబ్ టెక్నీషియన్‌ల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రికి నివేదించిన వివిధ జిల్లాల నాయకులు

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్‌లను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అసోసియేషన్ నాయకులు వాపోయారు. శనివారం సాయంత్రం కొరిటెపాడులోని ఎల్‌వీఆర్ క్లబ్‌లో డయాగ్నోకాన్-2024 సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్లు మాట్లాడుతూ ఉత్తర భారతదేశంలో ఎక్కడో ఒక కోర్టు తీర్పు ద్వారా ప్రతీ ల్యాబ్‌కు అర్హత పొందిన పెథాలజిస్టు ఉండాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఇక్కడ అమలు చేస్తూ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. దీని వలన గుంటూరు, కాకినాడ, ఏలూరు, వైజాగ్ వంటి జిల్లాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మంది రోడ్డున పడ్డారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పెథాలజిస్టుల ద్వారానే ల్యాబ్ రిపోర్టులు అందించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి రజని స్పందించి తాను ఈ విషయాన్ని సీఎం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇబ్బంది లేకుండా నిర్ణయం తీసుకొంటామని చెప్పారు. అలానే ల్యాబ్ టెక్నీషియన్‌లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సదస్సులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, కార్యదర్శి తాడేకోరు శ్రీహరి, కృష్ణ, శర్మ, బాబ్జి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మంత్రి రజనికి వినతిపత్రం అందజేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల సంఘాల నాయకులు



ప్రత్యేక హోదా కోసం ఉద్యమం ఉధృతం

- విభజన హామీల సాధన జేఏసీ పిలుపు

గుంటూరు, ఫిబ్రవరి 24: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్ని పార్టీలతో కలిపి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన విద్యార్థి, యువజన రాష్ట్ర జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో జేఏసీతో పాటు పలువురు నాయకులు మీడియాతో మాట్లాడారు. జేఏసీ కన్వీనర్ షేక్ జిలాని మాట్లాడుతూ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయకుంటే మార్చి ఒకటిన సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఢిల్లీ వేదికగా ఉద్యమాలు చేశామన్నారు. దీనికి ఏపీసీసీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ప్రత్యేక హోదా కోసం జేఏసీ చేసే ఉద్యమానికి సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఛలో సీఎం క్యాంపు కార్యాలయం పేరుతో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉడా మాజీ చైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, జేఏసీ నాయకులు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్, నూనె పవన్‌తేజ, కోట మాల్యాద్రి, శివారెడ్డి, నారదాసు వీరమణీంద్ర, చైతన్య, నరసింహారావు తదితరులున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

● వెస్ట్ డీఎస్పీ కేవీ మహేష్

గుంటూరు, ఫిబ్రవరి 24: ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలని వెస్ట్ డీఎస్పీ కేవీ మహేష్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం పోలీస్ కల్యాణ మండపంలో రానున్న ఎన్నికల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది వ్యవహరించాల్సిన తీరు, విధివిధానాలపై డీఎస్పీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఆంధ్రప్రదేశ్ జనరల్ ఎలక్షన్స్‌ను దృష్టిలో ఉంచుకుని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని పోలీసు అధికారులకు, ఎన్నికల విధులు నిర్వహించబోయే సిబ్బందికి పశ్చిమ డీఎస్పీ అవగాహన కల్పించారు. ఈ క్రమంలో నగరంపాలెం పోలీసుస్టేషన్ సీఐ నరేష్‌కుమార్, పట్టాభిపురం సీఐ విజయ్‌చంద్ర, అరండల్ పేట సీఐ వెంకటేశ్వరరెడ్డి, సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహం ఏర్పాటు కోసం

మా ఇంటిస్థలం ఇవ్వాలని బెదిరింపు

గుంటూరు, ఫిబ్రవరి 24 : వైఎస్ విగ్రహం ఏర్పాటు కోసం తమ ఇంటి స్థలం ఇవ్వాలని బెదిరిస్తున్నారని మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన బావోజమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మా గ్రామంలో 117 సంవత్సరాల నుంచి మా తాతల నుంచి సంక్రమించిన స్థలాల్లో నివాసం ఉంటు న్నామని, ఆయా స్థలాలు 1987లో రిజిస్ట్రేషన్ కూడా జరిగాయన్నారు. అయితే గత ఏడాది జూన్‌లో రోడ్డు విస్తరణ నిమిత్తం తాము నిర్మించుకున్న మూడు గృహాలను తొలగించారన్నారు. రోడ్డు విస్తరన నిమిత్తం తాము కూడా రోడ్డు విస్తరణ కావడంతో ఆయా గృహాల తొలగింపునకు అంగీకరించామన్నారు. అదే అలుసుగా అధికార వైసీపీ నాయకులు అక్కడ వైఎస్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు తమ స్థలం ఇవ్వాలని బెదిరిస్తున్నారని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేగాక తమ స్థలంలో ఇప్పటికే దిమ్మె కూడా ఏర్పాటు చేశారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తమ స్థలాన్ని రక్షించాలని బాధితుడు కోరాడు.

వైసీపీకి షాకిచ్చిన సిమ్స్ భరత్‌రెడ్డి దంపతులు

● అనుచరులతో లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిక



లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన భరత్‌రెడ్డి, శిరీష దంపతులు

గుంటూరు, ఫిబ్రవరి 24: నగరానికి చెందిన సిమ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ భీమనాథం భరత్‌రెడ్డి, కరస్పాండెంట్ శిరీష శనివారం యువనేత నారా లోకేశ్ సమక్షంలో శనివారం టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని నివాసంలో భరత్‌రెడ్డి, ఆయన సతీమణి శిరీషలకు లోకేశ్ పసుపుకండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ, కాంగ్రెస్ పార్టీల్లో వివిధ పదవుల్లో ఉన్న వారి అనుచరులు కూడా యువనేత సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనుచరులు శంకర్‌రెడ్డి, సిద్ధార్థ, అరవింద్, షోయబ్, దినేష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, మన్సూర్, మన్సూర్ గయాజ్, బేగ్, కృష్ణ, బుజ్జి. వెంకటేశ్వరరావు, నరేష్, వెంకటేశ్వరరావు, బాలయ్య, సుబ్బారావుతో పాటు పలువురు పార్టీలో చేరారు. వీరిని లోకేశ్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భరత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ఘనవిజయం సాధించడం తథ్యమని అన్నారు. టీడీపీ అభ్యర్థుల తొలి జాబితా అద్భుతంగా ఉందని, టీడీపీ విజయానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తామని భరత్‌రెడ్డి తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలంటే విజనరీ లీడర్ చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.

తప్పులున్నాయని.. నోటరీ కోసం ఒత్తిడి చేయకండి!

● సిబ్బందికి సూపరింటెండెంట్ ఆదేశాలు

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 19: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు దొర్లకుండా నిరోధించేందుకు ఇకపై పత్రాలతో పాటు సంబంధిత వ్యక్తుల ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని జతచేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ విధానంపై, ఆ కేంద్రం సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, సీఎస్ ఆర్ఎంవోతో ఆయన సమీక్ష జరిపారు. ఆధార్ కార్డులో ఉన్న పేర్లను ఎంఆర్‌డీ సిబ్బంది తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా టైప్ చేసి జనన, మరణ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకముందే సంబంధిత కుటుంబాలకు సెల్‌ఫోన్ ద్వారా వాట్సప్‌కు పంపాలని ఆయన సూచించారు. అంతా సరిగా ఉందని నిర్ధారించుకున్న తర్వాత ఈ పత్రాలను జారీ చేయాలన్నారు. పేరులో, స్పెల్లింగ్‌లో తప్పులున్నా, వాటిని నోటరీ చేయించాలని వారిపై ఒత్తిడి చేయవద్దని డాక్టర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు.

కన్నుల పండువగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి కల్యాణం



కల్యాణమూర్తులైన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామివార్ల ఉత్సవ మూర్తులు

గుంటూరు, ఫిబ్రవరి 24: ఇన్నర్‌రింగ్ రోడ్డులో రెడ్డిపాలెంలోనున్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ద్వాదశ వార్షిక కల్యాణ మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామివార్లకు వెంకటేశ్వర కోలాటం టీం భక్తులు కోలాటాలతో కనువిందు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ, గౌరవ అధ్యక్షుడు ఈదా సాంబిరెడ్డి, కమిటీ అధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు ఈదా పరశురామిరెడ్డి, కంది సంజీవరెడ్డి , తనుబుద్దు శ్రీనివాస్‌రెడ్డి, సీతారామిరెడ్డి తదితరులున్నారు.

వైభవంగా సత్యదేవుని నగరోత్సవం..

పట్టాభిపురంలోని రమా సత్యనారాయణస్వామి 47వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో నగరోత్సవం నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణలతో వైభవంగా సాగింది. టీటీడీ విశ్రాంత విద్వాంసులు పారుపల్లి రంగనాథ్ వారి బృందంచే స్వరార్చన జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ చావలి గణపతి, ఉత్సవాల నిర్వాహకుడు రావిపాటి సత్యనారాయణ తదితరులున్నారు.

అంబరాన్నంటిన చలపతి ఉద్గోష్ సంబరాలు



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో దాసరి రామకృష్ణ, వైవీ ఆంజనేయులు

తాడికొండ, ఫిబ్రవరి 24: సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ విద్యను మార్చుకోవాలని ఎవ్రాటెక్స్ సీఈవో దాసరి రామకృష్ణ తెలిపారు. మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న చలపతి ఉద్గోష్-2024 సంబరాలు శనివారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన రామకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడారు. రాబోయే రోజుల్లో చాట్ జీపీటీ, కృత్రిమ మేధల వల్ల వచ్చే సవాళ్లను అధిగమించటానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. డిగ్రీల కోసం కాకుండా ఆసక్తితో చదువులు కొనసాగించాలన్నారు. చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ రెండు రోజుల పాటు కళాశాలలో జరిగిన ఉద్గోష్-2024కు రాష్ట్రంలోని 60 కళాశాలల నుంచి 4500మంది విద్యార్థులు సాంకేతిక, కల్చరల్, క్రీడా పోటీలో పాల్గొని తమ ప్రతిభను చాటారన్నారు. భూతద్దం భాస్కర్ నారాయణ్ సినిమా హీరో శివా కందుకూరి, హీరోయిన రాశిసింగ్‌లు తమ డైలాగులు, డ్యాన్స్‌లతో అలరించారు. హ్యాపీడేస్ సినిమా ఫేమ్ టైసన్ రాహుల్, జబర్దస్త్ టీం పొట్టి నరేష్, పైమా, బాబు, నూకరాజు తమ స్కిట్లతో, పంచ్ డైలాగులతో విద్యార్థులను ఆనందింపజేశారు. అనంతరం ఉద్గోష్ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి వై సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ కే.కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ నాగ శ్రీనివాసరావు, ఉద్గోష్ కన్వీనర్ సాయి శ్రీనివాస్, బీ తులసీరాణి, డీ రాము, పీ బాలమురళీ కృష్ణ, వీవీ సుబ్బారావు, రామచంద్రరావు, శాంతిప్రియ, కళ్యాణ్‌కుమార్, గాంధీ పాల్గొన్నారు.

నేడు గ్రూపు-2 పరీక్ష

● 56 కేంద్రాల్లో 28,209 మంది అభ్యర్థులు

● పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని సీఎస్‌కు కలెక్టర్ నివేదన



సీఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీసీకి హాజరైన కలెక్టర్, జేసీ

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రూప్ 2 పరీక్ష నిర్వహణ కు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డికి నివేదించారు. శనివారం విజయవాడలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి క్యాంపు కార్యాలయం నుంచి చీఫ్ సెక్రెటరీ గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు, రెవెన్యూ, మూడో విడత రీసర్వే, ఇనాం అండ్ అసైన్డ్ భూములు, పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇళ్ల నిర్మాణాలు, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, ఎన్ఆర్ ఈజీఎస్, కరువు మండలాల్లో తాగునీరు, ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణం, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి, జేసీ జి.రాజకుమారి, డీఆర్వో పెద్ది రోజా పాల్గొన్నారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన జరిగే గ్రూప్ 2 పరీక్షలకు 28,209 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇందుకు గాను 56 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గ్రూప్ 2 పరీక్షల నిర్వహణపై ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారు జారీ చేసిన సూచనలను పాటించి ఎలాంటి పొరపాట్లు లేకుండా పరీక్షలు సాఫీగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద వంద రోజులు పని దినాలు కల్పిస్తామని, ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మండల స్థాయిలో ప్రోటోకాల్ పాటించాల్సిందే

● అభివృద్ధి కార్యక్రమాల సమీక్షలో జడ్పీ చైర్‌పర్సన్ హెని క్రిస్టినా



సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన విజయసారథికి ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ హెని క్రిస్టినా, సీఈవో వసంతారాయుడు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 24 : వివిధ కార్యక్రమాలు అమలు సందర్భంలో మండల స్థాయిలో ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాల్సిందేనని జిల్లా పరి షత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా స్పష్టం చేశారు. శనివారం గుంటూరు జిల్లా పరిషత్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మండల స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. పలు మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు తగిన గౌరవం ఇవ్వడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయా కార్యక్రమాలు జరుగు తున్నప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులను తగిన విధంగా ఆహ్వానించి, భాగస్వా మ్యం ఉండేలా చూడాల్సిన బాధ్యత మండల అభివృద్ధి అధికారులపై ఉంద న్నారు. ఇక మీదట ప్రోటోకాల్ అమలు విషయంలో ఫిర్యాదులు రాకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణ, గ్రామ సచివాలయాల పనితీరు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో సిబ్బంది హాజరు, పని తీరుపై సీఈవో వసంత రాయుడు సమీక్ష నిర్వహించారు.

ఉద్యోగ నియామకపు పత్రాల అందజేత

జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా జూనియర్ అసిస్టెంట్లుగా, ఆఫీసు సబార్డినెట్‌గా, యస్. సి.యస్.టి, బ్యాక్ లాగ్ నియామకాలు క్రింద రాత్రి కాపలాదారులుగా ఉద్యోగాలు పొందిన వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రొత్తగా ఉద్యోగాలు పొందిన వారు కష్టపడి పని చేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు మోహన్‌రావు, పూర్ణచంద్రారెడ్డి శ్రీనివాస రావు పాల్గొని మాట్లాడుతూ అరు లైన వారికి కారుణ్య నియామకాల త్వరితగతిన అందించారన్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, సీఈవో వసంత రాయుడుని యూనియన్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఏవో గరికపాటి శ్రీనివాసరావు జడ్పీ పరిపాలనా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24: డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించి, డ్వాక్రా మహిళలకు ఆర్థిక చేయూత అందించాలని రాష్ట్ర చేనేత ఉత్పత్తుల నిర్వాహకులు కోట దేవకిదేవి అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజారును శనివారం ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డ్వాక్రా బజారు మార్చి 21వ తేది వరకు కొనసాగుతుందని, డ్వాక్రా మహిళలు తయారుచేసిన ఉత్పత్తులు అందుబాటులో ఉంచామని వివరించారు. ముఖ్యంగా గద్వాల్, మదనపల్లి, వెంకటగిరి తోపాటు వివిధ రకాల పట్టు చీరలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. మొత్తం 80 స్టాల్స్‌ను ఏర్పాటు చేసామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత - ఆరోగ్యానికి భద్రత

● ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 24: యువజన వ్యవహారాలు - క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో శనివారం గుంటూరు ఏపీఎస్ ఆర్టీసీ ప్రాంగణంలో ఉన్నటువంటి ప్లాస్టిక్ బాటిల్స్, చిత్తు పేపర్లు, పనికిరాని వివిధ రకాల చెత్తను ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేకరించి డపింగ్‌యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్నటువంటి ప్రాంతాన్ని శుభ్రంగా ఉండే విధంగా చేయాలని ప్రజలకు అవగాహనా కల్పించాలని సూచించారు. వర్శిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ చుట్టూ ఉన్న సమాజం బావుండాలి అనే ఆలోచనతో సేవ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూత్ కోఆర్డినేటర్ సంజయ్, డిపోల డీఎం అబ్దుల్ సలాం, రామకృష్ణ, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కె.సత్య నారాయణ, జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి జేవీ సుధీర్‌కుమార్, టీజేపీఎస్, గురవయ్య, చలమయ్య, సిమ్స్ ఫార్మసీ, సిమ్స్ డిగ్రి, ప్రభుత్వ మహిళా కళాశాల, అభ్యుదయ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్య తోనే మెరుగైన భవిష్యత్తు

● ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానంద్‌రెడ్డి



మాట్లాడుతున్న దేవానంద్‌రెడ్డి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 24: విద్యార్థి భవిష్యత్తును ఉన్నతంగా మల చుకునేలా చేసే శక్తి విద్యకు మాత్రమే ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి అన్నారు. శనివారం గోరంట్లలోని భాష్యం రామసేతు టెన్త్ క్యాంపస్‌లో పదో తరగతి విద్యార్థులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ సలహాలు, సూచనలందించారు. దేవానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదవగలిగితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. లేనిపోని అపోహలు, భయాలను విడనాడి కష్టపడి చదివితే పరీక్షల్లో అనుకున్న ఫలితాలు వస్తాయన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు అందిస్తున్న సూచనలు పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో రామసేతు ప్రిన్సిపాల్ షఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27న గోళ్లమూడికి సత్కారం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24: ఈ నెల 27వ తేదిన స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగే సామాజికవేత్త, ఐద్వా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోళ్ళమూడి రాజసుందరబాబుకు సత్కార సభ నిర్వహిస్తున్నట్టు ఐక్య రాష్ట్ర కార్యదర్శి రాయపూడి చిన్నరాజు, దళిత క్రైస్తవ పాస్టర్ల సంఘం నాయ కులు పేరుపోగు సురేష్, డొక్కా జార్జి, లూర్థరాజు, సాల్మన్‌లు తెలిపారు. శనివారం స్థానిక అంబేద్కర్ భవన్లో పోస్టర్లను ఆవిష్కరించారు. సభలో పెద్ద సంఖ్యలో దళితులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆదిశంకరాచార్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 24: గుంటూరు బ్రాడిపేటలోని బ్రాహ్మణ సేవా సమితి ప్రాంగణంలో చౌడవరం లలితా పీఠం వ్యవస్థాపకులు పరమపూజ్య మేళ్లచెరువు సుబ్రహ్మణ్య శర్మ (శర్మాజీ) సౌజన్యంతో గణపతి, ఆంజనేయ సమేత ఆదిశంకరాచార్య స్వామి విగ్రహ వాయు ప్రతి ష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది.

గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24: గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లును, వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్న హోటళ్లపై రెవె న్యూ, పౌరసరఫరా అధికారులతో కలసి విజిలెన్స్ అధికారులు శనివారం దా డులు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకానీ రోడ్డులో పలు హోటళ్లలపై తనిఖీలు నిర్వహించి 9 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని యాజమానులపై అధికారులు కేసు నమోదు చేశారు.

ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24: వచ్చే నెల 3వ తేదిన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డాక్టర్ పరిమళ, డాక్టర్ అఖిల్ నికాంత్ తెలిపారు. శనివారం స్థానిక కేవీపీ కాలనీలో పట్టణ ఆరోగ్యకేంద్రంలో ఆశా, అంగన్‌వాడీలు, మెప్మా సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యకేంద్ర పరిధిలో 20 బూత్‌లు ఏర్పాటు చేశామని, 0-5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా అందించాలన్నారు. ఒకవేళ ఇతర ఇబ్బందులతో ఆరోగ్య కేంద్రాలకు రాలేని పరిస్థితి ఏర్పడితే 4, 5, 6 తేదీల్లో ఇంటింటికి వెళ్లి పల్స్ పోలియో చుక్కలు అందజేయాలన్నారు. ఆరోగ్య పరిధిలోని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు జీ శాంత కుమారి, ఆశాలు, అంగన్‌వాడీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను అందజేసిన రవీంద్ర, రత్నస్వామి సంస్థ సిబ్బంది

గుంటూరు, ఫిబ్రవరి 24: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ప్రభుత్వ కళాశాలల్లో చదివే ప్రతిభ కలిగిన పేద విద్యార్థులైన 167 మంది ఇంటర్ విద్యార్థులకు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు మాజేటి రామ్ కల్యాణ మండపంలో స్కాలర్‌షిప్పులను పంపిణీ చేశారు. గుంటూరు పశ్చిమ టీడీపీ ఇన్‌ఛార్జ్ కోవెలమూడి రవీంద్ర (నాని), రాజమండ్రి డీఎస్పీ టీవీ రత్నస్వామిలు విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తును మీరే తీర్చిదిద్దుకోవాలని కోరారు. మలబార్ అందించే సేవలు స్ఫూర్తివంతంగా ఉన్నాయన్నారు. టీవీ రత్నస్వామి మాట్లాడుతూ ఆడపిల్లల విద్యను ప్రోత్సహిస్తున్న మలబార్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్‌లు మాట్లాడుతూ 167 మంది విద్యార్థులకు రూ.14 లక్షల 78వేలు స్కాలర్‌షిప్పులను అందజేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 5వేల మంది పేద విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో రమణరావు, జుబేర్, జగన్నాథం పద్మ తదితరులున్నారు.

శారదా పరమేశ్వరి దేవస్థానం వార్షికోత్సవం



శత చండీయాగంలో శృంగేరి వేద పండితులు

గుంటూరు, ఫిబ్రవరి 24: సంపత్‌నగర్‌లోని శారదా పరమేశ్వరి దేవస్థానం 58వ వార్షిక వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శత చండీయాగాన్ని శృంగేరి నుంచి వచ్చిన వేద పండితులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటలకు గోపూజతో యాగ కార్యక్రమం ప్రారంభమయింది. అనంతరం గణపతి హోమం, శతచండియాగ సంకల్పం, పండితులకు దీక్షావస్త్ర సమర్పణ జరిగింది. ఈ శత చండీయాగం గురించి ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరిప్రసాదరావు మాట్లాడుతూ శృంగేరి నుంచి వచ్చిన పదిమంది వేద పండితులు నాలుగు రోజుల్లో 100 సార్లు చండీ పారాయణం చేస్తారని, 28వ తేదీన శారదా పరమేశ్వరి అమ్మవారికి మహాభిషేకం, శతచండి యాగ పూర్ణాహుతి ఉంటుందని చెప్పారు.

జగణాసుర పాలనకు చరమగీతం పాడుదాం

● 'తాడేపల్లిగూడెం' సభకు ప్రజాస్వామ్యవాదులంతా తరలిరండి

● టీడీపీ నేత, మాజీ మంత్రి కన్నా పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కన్నా

గుంటూరు, ఫిబ్రవరి 24: తాడేపల్లిగూడెంలో ఈ నెల 28న జరిగే టీడీపీ, జనసేన కూటమి నిర్వహించే భారీ బహిరంగసభకు జిల్లా నుంచి ఇరు పార్టీల కార్యకర్తలతో పాటు ప్రజాస్వామ్యవాదులంతా వేలాదిగా తరలిరావాలని మాజీ మంత్రి, టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణ కోరారు. శనివారం జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి ఆధ్వర్యంలో రూపొందించిన 'చలో తాడేపల్లిగూడెం' పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పాల్గొనే ఈ సభ రాష్ట్ర గతినే మార్చివేస్తుందని కన్నా తెలిపారు. రాష్ట్రం ఐదేళ్లగా జగణాసుర కబంధ హస్తాల్లో చిక్కుకొని విలవిల్లాడుతోందని, ఏపీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన వివరించారు. జగన్‌రెడ్డి చేస్తున్న అరాచకాలు, అక్రమాల నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేసేందుకు కలసికట్టుగా ముందుకు సాగుతున్న చంద్రబాబు, పవన్‌లకు ప్రజలంతా అండగా నిలవాలని కన్నా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, జనసేన నేతలు సయ్యద్ షర్ఫుద్దీన్, గడ్డం రోశయ్య, కొలసాని బాలకృష్ణ, నందూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరికీ పాత పెన్షన్ అమలు చేయాలి

● యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుక్‌లెట్ ఆవిష్కరణ



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 24: ఎటువంటి కాంట్రిబ్యూషన్ లేకుండా ఉద్యోగులకు పెన్షన్ చెల్లించే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనీ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షా ప్రధానకార్యదర్శులు బి.ఆదిలక్ష్మి. ఎం కళాధర్ అన్నారు. మ్యానిఫెస్టోలో పొందుపర్చిన తరవాత ఉద్యోగులను ఓటు అడగాలని వారు డిమాండ్ చేశారు. ఓట్‌ఫర్ ఓపీఎస్ పేరుతో శనివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో గోడ పత్రికలు, బుక్‌లెట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బి.ఆదిలక్ష్మి, కళాధర్‌లు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఉద్యోగులు ఉపాధ్యాయులు ఓపీఎస్ అమలు చేస్తా మన్న వారికే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ హనుమంతరావు జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు ఎం గోవిందు, ప్రేమ్‌కుమార్, కోటిరెడ్డి, షకీలా బేగం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యానికి రక్షణ

● వర్శిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రవిశంకరరెడ్డి



మాట్లాడుతున్న రవిశంకరరెడ్డి

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 24: మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యానికి రక్షణ అని వర్శిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.రవిశంకరరెడ్డి అన్నారు. స్థానిక కేవీపి కాలనీలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. యువత అంటే ఆట, పాటల్లోనే కాకుండా సామాజిక సేవలో ముందు ఉండడం నిజం గా చాలా అభినందనీయమని చెప్పారు. కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్. డి. ధాత్రి కుమారి, డాక్టర్. పరిమళ, పభుత్వ మహిళా కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ 2 ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రి శివారెడ్డి స్ఫూర్తితో బీజేపీని ఓడించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24: అమరజీవి సింహాద్రి శివారెడ్డి స్ఫూర్తి తో కేంద్రంలో అధికారంలో ఉన్న మతోన్మాద బీజేపీని దానికి మద్దతు ఇచ్చే పార్టీలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. శనివారం బ్రాడీపేటలోని జిల్లా కార్యాలయంలో సిం హాద్రి శివారెడ్డి 7వ వర్ధంతి, సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శివారెడ్డి జిల్లాలో అతివాద, మితవాద విచ్ఛిన్నకర ఉద్యమాలకు వ్యతిరేకంగా పోరాడి జిల్లాలో సీపీఎం నిర్మాణానికి కృషి చేశారు. కేంద్రంలో మోదీ ప్రభు త్వం మౌలిక స్వభావానికి విరుద్ధంగా లౌకిక విలువలను తుంగలో తొక్కి మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టే చర్యలు చేపడుతుంది, ఈ విధానాలకు వ్యతిరే కంగా శివారెడ్డి స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నళినికాంత్, భావన్నారాయణ, వేణుగోపాలరావు, ఎండీ అక్బర్, ఈమని అప్పారావు, లక్ష్మణ రావు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ సహకారంతో 28 నుంచి బ్యాడ్మింటన్ లీగ్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 24: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరి నియోజకవర్గ స్థాయిలో బ్యాడ్మింటన్ లీగ్ జరుగనుంది. ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాలు, గోడప్రతులను మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో తెలుగుయువత నేతలు శనివారం ఆవిష్కరించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య ఎంబీఎల్ వివరాలను విలేకర్లకు వెల్లడించారు. తాడేపల్లి మండలం పెనుమాకలోని జై హనుమాన్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 28 నుంచి మార్చి 3వ తేదీ వరకు బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 26వ తేదీలోపు మంగళగిరి టీడీపీ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, తెలుగుయువత అధ్యక్షుడు పడవల మహేష్, నేతలు బోగి వినోద్, గంటా ప్రసాద్, బొర్రా అరవింద్, ఒడిశా నరేష్, జయకృష్ణ, హనుమాన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

హైసెక్యూరిటీ నెంబరు ప్లేట్లు తప్పనిసరి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24: సుప్రీంకోర్టు, రాష్ట్ర రవాణా కమిషనరు వారి ఆదేశాల మేరకు హై సెక్యూరిటీ నెంబరు ప్లేట్లు తప్పనిసరి అని, లేని పక్షంలో రవాణా, రవాణేతర వాహనాలకు ఇకపై ఫిట్నెస్, రెన్యూవల్ చేయ బడవని డీటీసీ కరీం శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కొత్త వాహ నాలకు డీలర్ల వద్దనే నెంబరు ప్లేట్లు ఏర్పాటు చేస్తున్నారని, పాత వాహనా లు మార్చి1వ తేది నుంచి ఎస్ఐఏఎం పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని సూచించారు. పోర్టల్‌లో రెండు ఆప్షన్‌లు ఉన్నాయని ఒకటి డీలర్ వద్ద కాగా, మరొకటి వాహన యజమాని ఇంటి వద్దనే నంబరు ప్లేట్లు ఏర్పాటు చేసే విధానం ఉందని వివరించారు. వివరాలకు జిల్లా రవాణాశాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు. ఇకపై హైసెక్యూరిటి నెంబరు ప్లేట్లు లేని కొత్త, పాత వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

టీఎస్ ఈఏపీసెట్ నోటిఫికేషన్

దిక్సూచి

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్ఈ)- స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఈఏపీసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయుహెచ్) నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

కోర్సులు

- బీఈ, బీటెక్; బీటెక్(బయోటెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ); బీఫార్మసీ; బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/హార్టికల్చర్); బీఎస్సీ ఫారెస్ట్రీ; బీవీఎస్సీ అండ్ ఏహెచ్; బీఎఫ్ఎస్సీ
- ఫార్మా-డీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ)
- బీఎస్సీ నర్సింగ్

అర్హత: అభ్యర్థులు చేరదలచుకున్న కోర్సును అనుసరించి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.



టీఎస్ ఈఏపీసెట్ 2024 వివరాలు

- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మొత్తం 160 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.
- ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్ అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు; ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్ అభ్యర్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు ప్రక్రియ:** ఫిబ్రవరి 26 నుంచి
- **ఏదేని ఒక స్ట్రీమ్‌నకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **రెండు స్ట్రీమ్‌లకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 6
- **టీఎస్ ఈఏపీసెట్ 2024 తేదీలు:** ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్‌కు మే 9, 10; అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్‌కు మే 11, 12
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్(నాలుగు జోన్‌లు), నల్లగొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు.
- **వెబ్‌సైట్:** eapcet.tsche.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PWo1UkFలో చదవండి.

హాలియాలో విశ్వంభర చిత్రీకరణ





వశిష్ఠ దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సినిమా షూటింగ్ శనివారం నల్లగొండ జిల్లా హాలియాలోని వజ్రతేజ రైస్ ఇండస్ట్రీలో జరిగింది. పలు సన్నివేశాలు చిత్రీకరించారు. చిరంజీవితో పాటు నటులు రాజారవీంద్ర, హర్షవర్ధన్, వెన్నెల కిశోర్, చమ్మక్ చంద్ర, ప్రవీణ్, రోహన్, అకుల్, కుసుం చిత్రీకరణలో పాల్గొన్నారు. హాస్యనటులు, చిరంజీవికి మధ్య పలు సన్నివేశాలను చిత్రీకరించారు. వజ్రతేజ రైస్‌మిల్‌లో విశ్వంభర షూటింగ్ గురించి తెలుసుకున్న చిరంజీవి అభిమానులు, స్థానికులు ఉదయం నుంచే రైస్‌మిల్ వద్దకు భారీగా తరలివచ్చారు. హాలియా సీఐ రాఘవరావు అధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి షూటింగ్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు.

మే 9నే కల్కి రాక

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మే 9న ఈ చిత్రం విడుదల కానుంది. అయితే ఈ సినిమా విడుదల వాయిదా పడనుందంటూ డిజిటల్ మీడియాలో వస్తున్న వదంతులపై నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ స్పందించింది. ముందు ప్రకటించినట్లు మే 9న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు స్పష్టం చేశారు. నేపథ్యంలో వినిపిస్తున్న



సంగీతానికి అనుగుణంగా ప్రభాస్ పాదం కదుపుతున్న వీడియోను శనివారం మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే నటిస్తున్నారు. కమల్‌హాసన్ ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు.



భిన్నమైన పాత్రల్లో భీమా

గోపీచంద్ కథానాయకుడిగా ఏ. హర్ష దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. కేకే రాధామోహన్ నిర్మించారు. మార్చి 8న విడుదలవుతోంది. శనివారం



చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. గోపీచంద్ రెండు విభిన్నమైన పాత్రల్లో ఆకట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు హర్ష కథను అద్భుతంగా తెరపైకి తెచ్చాడు. రవి బస్రూర్ బ్యాగ్రౌండ్ స్కోర్ ఇరగదీశాడు. ప్రేక్షకులు ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. యాక్షన్‌తో పాటు కామెడీ, ఎంటర్టైన్‌మెంట్ చాలా గొప్పగా ఉంటుందని హర్ష తెలిపారు.

శనివారం సూర్య వేట



నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29న విడుదలవుతోంది. శనివారం నాని పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. సూర్య అనే పాత్రలో నాని స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఆయన పాత్రను మలచిన తీరు సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక.

సుజీత్ దర్శకత్వంలో

అలాగే నాని నటించే తదుపరి చిత్రాన్ని పుట్టిన రోజు సందర్భంగా ప్రకటించారు. 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మాత. 2025లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇతర వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

బహుముఖం ఉత్కంఠభరితం



హర్షివ్ కార్తిక్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బహుముఖం'. ఈ చిత్రం టీజర్‌ను శనివారం దర్శకుడు శశి కిరణ్ తిక్క చేతుల మీదుగా విడుదల చేశారు. 'టీజర్ బాగుంది. విజువల్స్‌తో పాటు సౌండ్‌కి చాలా ప్రాధాన్యత ఇచ్చారు. శ్రీచరణ్ బీజీఎం అదరగొట్టారు' అని ఆయన చిత్రబృందాన్ని ప్రశంసించారు. ఊహించని మలుపులతో కథ ఉత్కంఠభరితంగా సాగుతుందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. చాలా ప్రేమతో, కష్టంతో చేసిన సినిమా ఇది, ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉందని హర్షివ్ కార్తిక్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఫణి కల్యాణ్. బ్యాగ్రౌండ్ స్కోర్: శ్రీచరణ్ పాకాల. సినిమాటోగ్రఫీ: ల్యూక్ ఫ్లెచర్









తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



మనోహర్‌కి పుష్పగుచ్ఛం అందిస్తున్న వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం తదితరులు

తెనాలి అభివృద్ధికి మనోహర్ నాయకత్వం అవసరం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 24: ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని తెనాలి ప్రాంతాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించేందుకు నాదెండ్ల మనోహర్ వంటి సమర్థత కలిగిన నాయకుడి అవసరం ఎంతైనా ఉందని టీడీపీ సీనియర్ నాయకులు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి అన్నారు. శనివారం తెనాలి నియోజకవర్గానికి తెలుగుదేశం,జనసేన ఉమ్మడి అభ్యర్థిగా జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్లమనోహర్‌కు సీటు కేటాయించడంతో వీరవల్లిమురళి, కనగాల నాగభూషణం ఇతర సభ్యులు మనోహర్‌ను కలిసి ఆయనను దుశాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ స్పీకర్‌గా పాలన చేసిన అనుభవం మనోహర్‌కు ఉందన్నారు. ఆయన గతంలో తెనాలి ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులు చేశారని, నియోజవర్గంలో నెలకొని ఉన్న పలు సమస్యలను పరిష్కరించి ప్రజలకు సౌకర్యవంతమైన జీవనాన్ని నెలకొల్పారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తెనాలి ప్రాంతంలో అనేక సమస్యలు తిష్టవేశాయన్నారు. తెనాలి ప్రాంత వాసిగా నియోజవర్గంలో నెలకొని ఉన్న సమస్యలు, ప్రజల స్థితిగతులపై అనుభవం ఉన్న వ్యక్తి మనోహర్ అన్నారు. రానున్న ఎన్నికల్లో ఇరుపార్టీల ఉమ్మడి అభ్యర్థి మనోహర్‌ను గెలిపించుకుని మన ప్రాంత అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని మురళి పిలుపునిచ్చారు. గణేష్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయంలో సంబరాలు



మనోహర్‌కి సీటు కేటాయించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న జనసైనికులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 24: టీడీపీ, జనసేన ఉమ్మడి కార్యాచరణలో భాగంగా తెనాలి సీటు జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్లమనోహర్‌కు కేటాయించడంతో జనసేన పార్టీ కార్యాలయంలో సంబరాలు జరిపారు. పార్టీ శ్రేణులు స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం. తెనాలి ప్రాంతం అభివృద్ధి పథంలో నడిపించేలా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మనోహర్‌ను ఎంపిక చేయడం శుభపరిణామమని జనసైనికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు ఇరు పార్టీల నాయకులందరం సమానంగా పాటుబడనున్నట్లు వారు స్పష్టం చేశారు.

ఘనంగా శ్రీ లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

కొల్లిపర, ఫిబ్రవరి 24: కొల్లిపర కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య ఆలయంలో కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. తొలుత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య దంపతుల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించగా మహిళలు హారతులు ఇచ్చారు. అనంతరం పండితులు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించటానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని మున్నంగి, వల్లభాపురం, అన్నవరంగౌడపాలెం, సిరిపురం గ్రామాల్లో శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 24: గాయపడి చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మండల పరిధిలోని నండూరు గ్రామానికి చెందిన ముదిగర్ల రాఘవేంద్ర, శ్రీదేవి దంపతుల చిన్న కుమార్తె నిఖిత (6) మూడు రోజుల క్రితం గ్రామంలో ప్రైవేటు పాఠశాలకు వెళ్లింది. తిరిగి వస్తుండగా ప్రహరీగోడపై ఉన్న రాళ్లు మీదపడి తీవ్రంగా గాయపడింది. నిఖితను బంధువులు చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. చికిత్స పొందుతూ నిఖిత శుక్రవారం రాత్రి మృతి చెందింది. నిఖిత మృతిపై పొన్నూరు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు

మన్నవలో 85 మద్యం సీసాలు స్వాధీనం.. ఒకరి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న సెబ్ ఏఎస్పీ వెంకటేశ్వరరావు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 24: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం మద్యం విక్రేతను అరెస్టు చేసి అతని నుంచి 85 మద్యం సీసాలు సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మన్నవ గ్రామానికి చెందిన టీ రామకృష్ణ మద్యం తరలిస్తున్నారన్న సమాచారం అందటంతో సోదాలు నిర్వహించి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడి వద్ద ద్విచక్రవాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో స్థానిక సెబ్ అధికారులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన చలపతి ఉద్గోష్ సంబరాలు



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో దాసరి రామకృష్ణ, వైపీ ఆంజనేయులు

తాడికొండ, ఫిబ్రవరి 24: సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ విద్యను మార్చుకోవాలని ఎప్టోనిక్స్ సీఈవో దాసరి రామకృష్ణ తెలిపారు. మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న చలపతి ఉద్గోష్- 2024 సంబరాలు శనివారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడారు. రాబోయే రోజుల్లో చాట్ జీపీటీ, కృత్రిమ మేధల వల్ల వచ్చే సవాళ్లను అధిగమించటానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. డిగ్రీల కోసం కాకుండా ఆసక్తితో చదువులు కొనసాగించాలన్నారు. చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైపీ ఆంజనేయులు మాట్లాడుతూ రెండురోజుల పాటు కళాశాలలో జరిగిన ఉద్గోష్-2024కు రాష్ట్రంలోని 60 కళాశాలల నుంచి 4500మంది విద్యార్థులు సాంకేతిక, కల్చరల్, క్రీడా పోటీలో పాల్గొని తమ ప్రతిభను చాటారన్నారు. ముందుగా భూతద్దం భాస్కర్ నారాయణ్ సినిమా హీరో శివా కందుకూరి, హీరోయిన రాశిసింగ్‌లు తమ డైలాగులు, డ్యాన్స్‌లతో అలరించారు. హ్యాపీడేస్ సినిమా ఫేమ్ టైసన్ రాహుల్, జబర్దస్త్ టీం పొట్టి నరేష్, ఫైమా, బాబు, నూకరాజు తమ స్కిట్లతో, పంచ్ డైలాగులతో విద్యార్థులను ఆనందింపజేశారు. అనంతరం ఉద్గోష్ పోటీల్లో పాల్గొని గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి వై సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ కే.కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ నాగ శ్రీనివాసరావు, ఉద్గోష్ కన్వీనర్ సాయి శ్రీనివాస్, బీ తులసీరాణి, డీ రాము, పీ బాలమురళీ కృష్ణ, వీవీ సుబ్బారావు, జీ రామచంద్రరావు, ఎస్ శాంతిప్రియ, కళ్యాణ్‌కుమార్, పీ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజు మంచినీటి శాంపిల్స్ పరిశీలించండి

● మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి రూరల్, ఫిబ్రవరి 24: పట్టణంలో పైప్ లైన్ల ద్వారా సరఫరా అయ్యే తాగునీటి శాంపిల్స్‌ను సంబంధిత అధికారులు ప్రతిరోజు పరీక్షించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్నలు ఆదేశించారు. శనివారం ఆంధ్రజ్యోతి పత్రికలో వెలువడిన తెనాలిలో డయేరియా కలకలం అన్న కథనానికి స్పందించిన మునిసిపల్ అధికారులు పట్టణంలోని 11వ వార్డు గురవయ్య కాలనీని సందర్శించారు. ఆ ప్రాంతవాసులను కలుసుకుని సురక్షితమైన నీరు సరఫరా అవుతుందా లేదా అన్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పైపు లైన్ల ద్వారా సరఫరా అవుతున్న నీటి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలు జరిపారు. ప్రతిరోజు పైపులైన్ల ద్వారా వచ్చే నీటిని పరీక్షించడం జరుగుతుందని, సురక్షిత నీరు అందించడమే లక్ష్యంగా మునిసిపాలిటీ పనిచేస్తుందని ప్రజలకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ అధికారులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

డ్రెయినేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 24: పట్టణంలో డ్రెయినేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తామని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక తెలిపారు. శనివారం పట్టణంలోని 7, 8, 9, వార్డుల మెయిన్ డ్రెయినేజ్ కాల్వలో సిల్ట్ తొలగింపు పనులను పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక పర్యవేక్షించి, పలు సూచలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ సుందరీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వ్యర్థాలను మురుగు కాల్వలలో వేయరాదని, మున్సిపల్ కార్మికులకు అందిచాలన్నారు. డ్రెయిన్‌లను ఆక్రమించుకొని ర్యాంపులను నిర్మించడం, షాపులను నిర్వహించడం చేయరాదని, వాటికి స్వచ్ఛందంగా తొలగించాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, గ్రీనరీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నూరులో టీడీపీ నాయకుల సంబరాలు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 24: 7వ సారి పొన్నూరు అసెంబ్లీ బరిలో టీడీపీ అభ్యర్థిగా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను ప్రకటించటం పట్ల శనివారం టీడీపీ శ్రేణులు పట్టణంలో సంబరాలు నిర్వహించారు. 1994 నుంచి ఇప్పటివరకు 6 పర్యాయాలు నరేంద్ర పొన్నూరు నుంచి పోటీ చేసి వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 7వ సారి పొన్నూరు నుంచి బరిలో దిగేందుకు ఇప్పటికే అన్ని రకాల కసరత్తులను నరేంద్రకుమార్ ప్రారంభించారు. నరేంద్ర కుమార్ పేరును శనివారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సమక్షంలో ప్రకటించటం పట్ల టీడీపీ శ్రేణులో హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పట్టణంలోని ఐల్యాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు నిర్వహించిన టీడీపీ శ్రేణులు బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. చేబ్రోలులో మండల పార్టీ అధ్యక్షుడు షైలా వెంకట రామరాజు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించి నరేంద్ర కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సంబరాలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పొన్నూరులో సంబరాలు నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు



తహసీల్దార్ కార్యలయంలో వినతిపత్రం అందచేస్తున్న బీజేపీ నాయకులు

రథోత్సవానికి ఇబ్బందిగా రోడ్డు విస్తరణ పనులు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 24: పొన్నూరులో ప్రసిద్ధి చెందిన సాక్షి భవనారాయణ స్వామి ఆలయ రథోత్సవానికి ఇబ్బందులు కలిగించేలా పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. శనివారం రోడ్డు విస్తరణ పనులో భాగంగా నిర్మిస్తున్న సెంటర్ల డివైడర్ పనులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు తహసీల్దార్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రథోత్సవాన్ని వీక్షించేందుకు జిల్లా నలుమూల నుంచి ప్రజలు పొన్నూరు తరలివస్తారన్నారు. బ్రహ్మోత్సవాలో భాగంగా జరిగే రథోత్సవం జీబీసీ రోడ్డు నుంచి కసుకర్రు రోడ్డు వరకు సాగుతుందన్నారు. కానీ ఈ రహదారిలో సెంటర్ డివైడర్ నిర్మించటం వల్లన రథోత్సవానికి ఆటంకం కలగటమే కాకుండా భక్తులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్ని వారు చెప్పారు. డివైడర్ నిర్మాణాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షుడు కలపాల శ్రీనివాసరావు, చిలకపాటి రామలక్ష్మణాచారి, గుడివాడ పవన్, తోట జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్ - 2 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

చేబ్రోలు, ఫిబ్రవరి 24: గ్రూప్ - 2 పరీక్షలు నిర్వహించేందుకు చేబ్రోలు ఇంజనీరింగ్ కళాశాల సెయింట్ మేరీస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల, విజ్ఞాన్ యూనివర్సిటీలో విస్తృత్త ఏర్పాట్లను అధికారులు చేశారు. ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే ఈ పరీక్షకు పోలీసులు పలు ఆంక్షలు విధించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షా కేంద్రాల వద్ద ఉండే కంప్యూటర్, జిరాక్స్ షాపులు మూసివేయాలని ఆదేశించారు. గ్రూప్ - 2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి ఆటంకాలు కల్పించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

ప్రజాపోరుతో ప్రజలకు చేరువ



ప్రజాపోరు యాత్రలో భాగంగా పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి24: ప్రజా పోరు యాత్ర ద్వారా ప్రజలకు బీజేపీని చురువ చేయనున్నట్లు ఆ పార్టీ నాయకులు మొఖమాటం శివ తెలిపారు. శనివారం బీజేపీ ప్రజాపోరు యాత్ర పట్టణ, గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాండురంగ విటల్, నాంగేద్ర కుమార్ యాదవ్, చెరుకూరి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 24: పట్టణంలో రోడ్లను ఆక్రమించి ఏర్పాటుచేసిన షాపులను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. స్థానిక కొత్తపేటలోని ఎంఆర్‌వో కార్యాలయం ఎదురు రోడ్డులో రోడ్డును ఆక్రమించి షాపులను నిర్వహిస్తున్న యజమానులకు నోటీసులు ఇచ్చినా ఖాళీ చేయనందున శనివారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారలు, మున్సిపల్ సిబ్బందిచే తొలగించారు. పట్టణంలో పలు రద్దీ ప్రాంతాలలో రోడ్లను ఆక్రమించుకొని, ట్రాపిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వ్యాపారాలు చేస్తున్న వారి షాపులను తొలగించకుండా, ఎటువంటి రద్దిలేని ప్రాంతంలో షాపులను తొలగించడంపై పలువురు పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అచ్చు యంత్రం ఆవిష్కరణతో విప్లవాత్మక మార్పులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 24 : అచ్చుయంత్రాన్ని జాన్‌గూటెన్ బర్గ్ ఆవిష్కరించడంతో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ప్రింటర్స్ అసోసియేషన్ కార్యదర్శి విశ్వేశ్వరరావు చెప్పారు. నెహ్రూ రోడ్డులో శనివారం ప్రింటర్స్ డే వేడుకలు నిర్వహించారు. జాన్‌గూటెన్‌బర్గ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. అధ్యక్షుడు తాతా శివశంకరరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లు

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి 24: పట్టణంలో పేదప్రజల కోసం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు, క్యాంటీన్ నిర్వాహక సభ్యుడు సోమవరపు సాంబశివరావు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో శనివారం ఎన్నారై విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. శివాజిచౌక్‌లోని అన్న క్యాంటీన్‌లో ఆలపాటి రాజా దంపతుల సహకారంతో ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రొత్తపల్లి రమేష్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, గోగినేని రమేష్, మాదల కోటేశ్వరావు, వెల్లంకి సాంబయ్య, ముళ్ళపూడి వెంకట్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



తెనాలి టీడీపీ కార్యాలయం వద్ద పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు

ఆలపాటికి సీటు లేకపోవడంతో

టీడీపీ క్యాడర్‌లో నిరుత్సాహం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 24: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు తెనాలి నియోజవర్గంలో సీటు లేదన్న విషయం తెలియడంతో పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం నెలకొంది. తెనాలిలోని కొత్తపేట పార్టీ కార్యాలయానికి పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు చేరి కార్యాచరణపై చర్చించుకున్నారు. గత ఐదేళ్లుగా తెనాలి నియోజవర్గంలో పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లిన నాయకుడు ఆలపాటి అని అటువంటి వ్యక్తికి పొత్తుల్లో భాగంగా పార్టీ తీసుకున్న నిర్ణయం సరైనది కాదని వారు అభిప్రాయ వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తెనాలిలో నాయకులు, పార్టీ శ్రేణులపై అనేక కేసులు పెట్టారని, అమరావతి రాజధానిగా జేఏసీ పిలుపుతో చేసిన నిరసనల్లో దీక్ష శిబిరాన్ని కూడా నిప్పుపెట్టిన ఘనటలు కూడా ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. ఇదే ప్రాంతానికి చంద్రబాబును రానియ్యకుండా వైసీపీ చేసిన కుట్రలను ఆలపాటి సారధ్యంలో చంద్రబాబును తెనాలికి తీసుకురాగలిగామని, క్యాడర్‌లో పట్టుపెంచి వారికి అండగా నిలబడే గొప్ప వ్యక్తి ఆలపాటి అన్నారు. అక్రమ కేసులతో వైసీపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా అందరికీ ధైర్యం నింపి ముందుకు నడిపిన నాయకుడు ఆలపాటి అని అటువంటి నాయకుడిని పార్టీ అధిష్టానం సీటు లేకుండా చేయడం బాధాకరమన్నారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న తెనాలిలో రాజేంద్రప్రసాద్ పోటీ చేయడంలేదంటే కేడర్ తట్టుకునే పరిస్థితి లేదని భావోద్వేగానికి పలువురు లోనయ్యారు. తదుపరి కార్యాచరణపై తాము ప్రకటించేంత వరకూ సమ్యమనం పాటించాలని ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఓ ప్రకటన ద్వారా పార్టీ నాయకులకు సూచించారు.

27న రామాచార్యుల కాంస్య విగ్రహావిష్కరణ

● హాజరు కానున్న త్రిపుర గవర్నర్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 24 : తెనాలి ప్రాంత బీజేపీ సీనియర్ నాయకుడు అర్చక ఉద్యమ పితామహుడు టి.రామాచార్యుల కాంస్య విగ్రహాన్ని ఈ నెల 27న ఆవిష్కరించనున్నారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల వద్ద ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేసిన తెనాలి బండ్‌పై విగ్రహాన్ని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి ఆవిష్కరిస్తారని బీజేపీ నాయకులు అనంతాచార్యులు తెలిపారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కృషితో తెనాలి బండ్ ఏర్పాటు అవుతుందని, దీనిపై రామాచార్యుల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఆయన కృషి అభినందనీయమన్నారు. బీజేపీ జిల్లా నాయకులు యడ్లపాటి రఘునాథబాబు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఆర్ఆర్ఎస్, జనసంఘ్, బీజేపీలో రామాచార్యులు విశేష సేవలు అందించారని చెప్పారు. అర్చకుల సంక్షేమానికి సంఘాలు స్థాపించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. అడపా సంపత్ రాయుడు, రఘు, శ్రీనివాసమూర్తి, దారా సాయిగుప్తా, సుబ్బారావు, మాధవకుమార్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల పరిశీలన



సుజాతా ఇంటర్ కాలేజీని పరిశీలిస్తున్న అర్బన్ సీఐ భాస్కర్

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 24: పొన్నూరు పట్టణంలోని ఇంటర్‌మీడియట్ పరీక్షా కేంద్రాలను శనివారం అర్బన్ సీఐ పి.భాస్కర్ పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలోని సుజాతా డిగ్రీ కళాశాల, శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల, పీబీఎన్ కళాశాల పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్ల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.